

**నాగుల చవితి** ▸ కార్తీక మాసం నాగుల చవితి సందర్భంగా నాగదేవతను పూజిస్తున్న భక్తులు


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, బుధవారం 6 నవంబర్ 2024 | HYDERABAD





ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ తల పెట్టిన మహాధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నగేశ్ తదితరులు





## జనంతో కేటీఆర్ మాట.. ముచ్చట

**సెల్ఫీలు దిగేందుకు పోటీపడిన అభిమానులు**

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : భోజనం చేసేందుకు సికింద్రాబాద్ ప్యారడైజ్ హోటల్‌కు వచ్చిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సెల్ఫీ దిగేందుకు పలువురు పోటీపడ్డారు. కేటీఆర్ అందరిని ఆప్యాయంగా పలకరించారు. హోటల్ నిర్వాహకులు కేటీఆర్‌తో ముచ్చటించి సెల్ఫీలు దిగారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దాస్యం వినయ్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

# చలాన్ డబుల్



- కేసీఆర్ హయాంలో నామమాత్రంగా ట్రాఫిక్ జరిమానాలు
- కాంగ్రెస్ పాలనలో రెట్టింపు అయ్యాయి
- నగరంలో భారీ జరిమానాలు
- 2019 చట్టం అమలుపై అనుమానాలు
- ప్రమాదాలు నివారించేందుకే గరిష్ట జరిమానాలు : ట్రాఫిక్ అదనపు సీపీ

**నగరవాసుల నెత్తిన ట్రాఫిక్ పోలీసులు డబుల్ చలాన్లతో రెట్టింపు భారం వేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా హెల్మెట్ లేకుంటే రూ. 200, రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తే రూ. 2 వేల జరిమానా విధిస్తున్నారు. 2019లోనే కేంద్రం జరిమానాలు పెంచినా, అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఆ భారాన్ని రాష్ట్ర ప్రజలపై వేయలేదు, అప్పటికే రాష్ట్రంలో అమలులో ఉన్న పద్ధతినే కొనసాగించారు. దీంతో పాటు వాహనదారులు ఉల్లంఘనలకు పాల్పడకుండా, విస్తృతంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలంటూ ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే ఇప్పుడు వాహనదారులు ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానాలను వంద శాతం అధికం చేసి రెట్టింపు వసూలు చేస్తున్నారు.**

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): హెల్మెట్ ధరించని వారు, రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వారిపై మంగళవారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. సోమవారం వరకు హెల్మెట్ లేని వారికి రూ. 100, రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తే రూ. 1000 వరకు జరిమానా విధిస్తూ వచ్చారు. మంగళవారం నుంచి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో హెల్మెట్ ధరించని వారికి రూ. 200, రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తే రూ. 2 వేల జరిమానా విధిస్తామంటూ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించి, అమలులోకి తీసుకొచ్చారు.దీంతో ఒక్కసారిగా నగర వాసులు ఉలిక్కిపడ్డారు. 2019లో కేంద్రం భారీగా జరిమానాలు పెంచుతూ చట్టాన్ని చేసింది, అయితే దానిని ఇప్పుడు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పావులు కదుపుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిరోజు కనీసం 18 వేల వరకు ట్రాఫిక్ ఉల్లంఘనలపై కేసులు నమోదవుతున్నాయి. వీటిని పెంచడంతో పాటు ధరలను కూడా పెంచడంతో రెట్టింపు ఆదాయం వస్తుందనే ఆలోచన జరుగుతుందా? ప్రస్తుతం హెల్మెట్, రాంగ్‌రూట్‌లకు జరిమానాలను పెంచి, నెమ్మదిగా మరింత భారం ప్రజలపై వేసేందుకు ఏదైనా సన్నాహాలు జరుగుతున్నాయా? అనే అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులకు జరిమానాలపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పెట్టడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. జరిమానాలు వసూలు , పెంచడం పైనే పోలీసులు, ప్రభుత్వం దృష్టి పెట్టిందంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### చలాన్లు రెండింతలు..!

మోటార్ వాహనాల చట్టం ప్రకారం కనిష్టం, గరిష్టంగా జరిమానాల రేట్లు ఉన్నాయి. అయితే పోలీసులు చలాన్ల నుంచి ఎక్కువ ఆదాయం రాబట్టేందుకు ప్రణాళిక చేపట్టారు. గతంలో కనిష్టం ఏదుంటే దానిని జరిమానాగా విధించేవారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చలాన్లు పడకుండా వాహనదారులు చూసుకోవాలంటూ జాగ్రత్తలు చెప్పేవారు. ఒక చలాన్ పడిందంటే, మరో చలాన్ పడకుండా వాహనదారులు జాగ్రత్తలు తీసుకుంటూ నిబంధనలు పాటించేవారు. ఈ క్రమంలోనే రిపీటెడ్‌గా ఉల్లంఘనలకు పాల్పడే వారిని గుర్తించి వారికి కొన్నిసార్లు జరిమానాలు పెంచేవారు. నేడు మాత్రం ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించకుండా, ట్రాఫిక్ రద్దీలో వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తూ పండుగలు, పబ్బాలు అని కూడా చూడకుండా చలాన్ల వసూళ్లే ధ్యేయంగా ట్రాఫిక్ పోలీసులు పనిచేస్తూ, అసలు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయాన్ని మర్చిపోయారంటూ నగర వాసులు వాపోతున్నారు. పోలీసులు అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో లేకపోవడం, రోడ్లపై విజుబుల్ పోలీసింగ్ కన్పించకపోవడంతో వాహనదారులు కూడా కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఘటనలున్నాయి.

### ప్రమాదాలు జరగకుండా చర్యలు

నగరంలో హెల్మెట్ ధరించకుండా ప్రయాణించే వారితో పాటు రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వారితోనూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల వరుసగా మూడు ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలతో బయటపడే వారు. హెల్మెట్ ఉంటే ప్రమాదం సంభవించినప్పుడు 80 శాతం వరకు ప్రాణాలతో బయటపడే అవకాశాలుంటాయి. అయితే ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనే ఉద్దేశంతోనే హెల్మెట్, రాంగ్‌రూట్‌లకు గరిష్టంగా రూ. 200, రూ. 2 వేల జరిమానా వేయాలని ఆదేశించాం. మేం కొత్తగా ఏదీ అమలు చేయడం లేదు, ఉన్న జరిమానాలనే అమలు చేస్తున్నాం. 2019 కేంద్రం పెంచిన జరిమానాలకు, మేం చేపట్టిన డ్రైవ్‌కు ఎలాంటి సంబంధం లేదు.

**-ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్**

కాంగ్రెస్ పాలనలో

## బతుకులు ఆగమైనయ్

- ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే.. ఉద్యమం చేస్తాం
- తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ హెచ్చరిక
- ఇందిరా పార్క్ మహాధర్నా విజయవంతం

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డు పాలయ్యాయని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ మహాధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు గిరాకీ లేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే సంబంధిత రవాణా శాఖ మంత్రి చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఆత్మహత్యలు చేసుకున్న డ్రైవర్ల కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చిన సర్కార్ ఇప్పుడు మౌనం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఏఐటీయూసీ వెంకటేశం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఫైనాన్షియర్ల దోపిడీని అరికట్టాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ శ్రీకాంత్, టీయూసీఐ ప్రవీణ్, ఆటోయూనియన్ నాయకులు సలీంభాయ్, సత్తి రెడ్డి, గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.






# వివాదాస్పద భూములపై ప్రభుత్వం ఆరా

- ఆక్రమణలు, కోర్టు వివాదాలున్న భూముల వివరాలు సేకరణ
- హెచ్ఎండీఏ పరిధిలో 8వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిలో వివాదాస్పద భూములపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ మేరకు హెచ్ఎండీఏ వద్ద ఉన్న భూముల్లో కోర్టు వివాదాలు, ఆక్రమణల జాబితాను సిద్ధం చేసేందుకు హెచ్ఎండీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా వివాదరహిత ల్యాండ్ బ్యాంక్‌ను గుర్తించి నివేదిక రూపొందించనున్నారు. హెచ్ఎండీఏ వద్దే విలువైన భూములు ఉండగా... తాజా చర్యలు దేనికి అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. భూముల స్థితిగతులను అంచనా వేసే క్రమంలో తాజా నివేదికను రూపొందిస్తున్నట్లు తెలిసింది. ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన హెచ్ఎండీఏ పుష్కలమైన ల్యాండ్ బ్యాంక్‌ను కల్గి ఉంది.హుడా నుంచి హెచ్ఎండీఏగా రూపాంతరం చెందిన తర్వాత ప్రభుత్వం భారీ మొత్తంలో భూములను కేటాయించింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మహానగరంలో మౌలిక వసతుల కల్పనకు అనుగుణంగా వినియోగించుకునేలా హెచ్ఎండీఏ ఆధీనంలో దాదాపు 8వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ ఉండగా... ఇందులో ఇప్పటికే పలు ప్రాజెక్టుల కోసం భారీ స్థాయిలో భూములను కేటాయించారు. టైటిల్, పొసెషన్ క్లియరెన్స్ ఉన్న ఆయా సర్వే నంబర్లలో ఉన్న భూముల వివరాలను సేకరిస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో బుద్వేల్ ఐటీ పార్క్, ట్రక్ పార్క్ వంటి కీలక ప్రాజెక్టుల కోసం కేటాయించడంతోపాటు, ట్రక్ పార్క్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

### కోర్టు వివాదాలే ఎక్కువ...

ఓఆర్ఆర్‌కు సమీపంలో హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న భూముల్లో ఎక్కువ కోర్టు వివాదాల్లోనే ఉన్నాయి. ఈక్రమంలో వాటిని ఆయా కోర్టు కేసులు, ప్రస్తుత పరిస్థితి, స్వాధీనంలో ఉన్న భూముల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయనున్నట్లు తెలిసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 7,452 ఎకరాలను హెచ్ఎండీఏకు కేటాయించారు. ఇప్పటికే 3500 ఎకరాలకు పైగా వినియోగంలోకి వచ్చింది. అలాగే హైదరాబాద్ జిల్లా పరిధిలో 249 ఎకరాలు, మెదక్ జిల్లా పరిధిలో 558 ఎకరాల ల్యాండ్ బ్యాంక్ ఉండగా... ఈ రెండు జిల్లాల్లో 50 శాతానికి పైగా వివిధ ప్రాజెక్టుల పేరిట హెచ్ఎండీఏ ఇప్పటికే వినియోగంలోకి తీసుకువచ్చింది. మిగిలిన 4300 ఎకరాల భూముల్లో ఎంత వరకు క్లియర్ టైటిల్, పొసెషన్, కోర్టు చిక్కులు లేకుండా ఉందనే విషయాన్ని తెలుసుకోనున్నారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని మియాపూర్‌లో సర్వే నం.20,28లో మొత్తం 105 ఎకరాలు ఉండగా. దీనిని ఇంటర్ సిటీ బస్ టెర్మినల్ ప్రాజెక్టును చేపట్టేందుకు కేటాయించారు. అలాగే రాజేంద్రనగర్ పరిధిలో 6 ఎకరాల్లో పరాధీనంలో ఉండగా, మియాపూర్ పరిధిలోనూ మరో 46 ఎకరాలు కోర్టు వివాదంలో ఉన్నట్లు సమాచారం. ఇటీవల ఆక్రమణలతో వివాదాస్పదమైన మియాపూర్‌లోని సర్వే నం.100, 101లో ఉన్న 450 ఎకరాల భూమి మొత్తం కోర్టు వివాదంలోనే ఉంది. 2003లోనే ఈ భూములన్నీ హెచ్ఎండీఏకు చెందినవని హైకోర్టు ఆదేశించినా... అప్పటికే వందల ఎకరాల్లో నిర్మాణాలను గుర్తించారు. నానక్‌రాంగూడ పరిధిలోని విలువైన భూమి కూడా వివాదంలో ఉంది. రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్‌లో 282 నుంచి 290 వరకు సర్వే నంబర్లలో ఉన్న 85 ఎకరాల విస్తీర్ణంలో 72 ఎకరాలను సైన్స్ సిటీ నిర్మాణానికి కేటాయించగా, మరో 13 ఎకరాల వెకేట్ ల్యాండ్ ఉన్నట్లు తెలిసింది. ఇలా మొత్తంగా 1200 ఎకరాలు కోర్టు వివాదాల్లో ఉందనీ, ఎలాంటి కోర్టు వివాదాలు, ఆక్రమణలు లేకుండా ఉన్న భూమి కేవలం 2500 ఎకరాలు ఉన్నట్లు సమాచారం. అయితే సమగ్రమైన వివరాలతో నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి హెచ్ఎండీఏ అందజేయనుంది.

నిధులిచ్చినా.. భూములిచ్చినా

## శంకుస్థాపన జరగలేదు

**ప్రారంభానికి నోచుకోని మాదారం ఇండస్ట్రియల్ పార్క్**

- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 186 ఎకరాల భూమి కేటాయింపు
- టీఎస్ఐఐసీకి అప్పగించి పార్క్ ఏర్పాటుకు లైన్ క్లియర్
- అయినా పనులు ప్రారంభించడంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం

మేడ్చల్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మాదారం ఇండస్ట్రియల్ పార్క్ (పారిశ్రామికవాడ) ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పార్క్ ఏర్పాటుకు రూ. 60 కోట్ల నిధులు వెచ్చించి 186 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమిని రెవెన్యూ అధికారులు టీఎస్ఐఐసీకి అప్పగించి ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు లైన్ క్లియర్ చేశారు. కానీ, ఇండస్ట్రియల్ పార్క్ పనుల ప్రారంభంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. టీఎస్ఐఐసీకి భూమి కేటాయించిన క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. అయితే, అభివృద్ధి పనుల ప్రారంభం పై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదని అధికారులు చెబుతున్నారు.

### పర్యావరణ రహిత పరిశ్రమలు..

మాదారంలో ఇండస్ట్రియల్ పార్క్‌లో వందలాది సంఖ్యలో పర్యావరణ రహిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. టీఎస్ఐఐసీ లే అవుట్ చేసి అన్ని సౌకర్యాలను కల్పించి పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకున్న వారికి కేటాయించేలా చర్యలు తీసుకుంటారు. అయితే ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటులో ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. పరిశ్రమల ఏర్పాటుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అనుకూలంగా ఉన్న క్రమంలో వేలాది సంఖ్యలో పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్నారు. మాదారంలో ఇండస్ట్రియల్ పార్క్ పనులు పూర్తయితే భారీ, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు 250 వరకు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. అలాగే, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికైనా ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.




ప్రభుత్వానికి విన్నవించడమంటే

# దున్నపోతు మీద వాన పడినట్టే

- గురుకులాల నిర్వహణలో ప్రభుత్వం విఫలం
- విద్యార్థుల గోస పట్టదా..
- ఏడు నెలల్లో 36 మంది చనిపోయారు
- తరచూ ఫుడ్ పాయిజన్, ఎలుకల కాట్లకు గురవుతున్నా ప్రభుత్వానికి సోయి లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- నిమ్స్‌లో ఆసిఫాబాద్ చిన్నారులకు పరామర్శ

ఖైరతాబాద్, నవంబర్ 5 : గురుకులాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఎలుకలు, పాము కాట్లతో ఆస్పత్రుల పాలవుతున్నా వారి గోస పట్టనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఆసిఫాబాద్ కొమురం భీం జిల్లా వాంకిడి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన ఎనిమిదో తరగతి చదువుతున్న మహాలక్ష్మి, తొమ్మిదో తరగతి చదువుతున్న జ్యోతి, శైలజను నిమ్స్ దవాఖానలో చేర్చారు. మహాలక్ష్మి కోలుకోగా, జ్యోతి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపర్చడానికి వైద్యులు ప్రయత్నిస్తున్నారు. శైలజ వెంటిలేటర్‌పై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ... గురుకుల పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య దొరుకుతుందని తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను చేర్పిస్తారని, కానీ పదకొండు నెలల కాంగ్రెస్ పాలనలో తల్లిదండ్రుల నమ్మకాన్ని పోగొట్టేలా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో పరిస్థితులు దిగజారాయని ఆరోపించారు. రెసిడెన్షియల్ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, అందుకు వరుసగా జరుగుతున్న ఘటనలే సాక్ష్యమన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో 36 మంది విద్యార్థులు చనిపోయారని, సుమారు 600 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారని తెలిపారు. ఆ విద్యార్థుల మరణాలు ప్రభుత్వం చేసిన హత్యలే అని అనడంలో ఎలాంటి తప్పులేదన్నారు. ఈ మరణాలపై ప్రభుత్వానికి సోయి లేదని, వాటిపై ఏ స్థాయిలోనూ సమీక్షలు నిర్వహించలేదని చెప్పారు. ఇటీవల మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కరెంటు షాక్ తగిలి ఆస్పత్రి పాలయ్యారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా దున్నపోతు మీద వానపడినట్లే ఉందని విమర్శించారు. కేసీఆర్ గురుకులాలను ఎవరెస్టు స్థాయికి పెంచితే, రేవంత్ రెడ్డి విద్యార్థులను ఎలుకలు, పాములు కరిచే స్థాయికి తీసుకెళ్లారని దుయ్యబట్టారు. చలికాలంలో విద్యార్థులకు ముందు రగ్గులు అందించు.. అంటూ సీఎం రేవంత్ రెడ్డికి చురకలు వేశారు. గురుకులాలను సమీక్షించేందుకు గతంలో సెంట్రల్ కమాండ్ సిస్టం ఉండేదని, ఇప్పుడు అలాంటి పద్ధతులు ఏమీ లేవన్నారు. ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌కు ఒక హెల్త్ సూపర్‌వైజర్ ఉండాలని, విద్యార్థులు జబ్బు పడితే కనీసం మందులు కూడా అందుబాటులో లేవని చెప్పారు. విద్యార్థులు పడుకునేందుకు కనీసం బెడ్లు లేవని, కింద పడుకోవడం వల్ల పాముకాట్లకు గురవుతున్నారన్నారు. ముఖ్యమంత్రికి గురుకులాలపై సదాభిప్రాయం లేదని ఇటీవల చేసిన వ్యాఖ్యలను బట్టి తెలుస్తోందని, వాటిని మూసివేసేందుకు కుట్ర జేస్తున్నారన్న అనుమానం కలుగుతుందన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని, బేషజాలకు పోకుండా గురుకులాలకు ఉన్న పేరును పాడు చేయొద్దని హితవు పలికారు.

### హరీశ్‌రావు రాకతో.. నిమ్స్‌కు మంత్రుల పరుగులు

**ఫుడ్‌పాయిజన్‌కు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించేందుకు ఎమ్మెల్యే హరీశ్‌రావు వచ్చారన్న విషయం తెలుసుకున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ నిమ్స్ దవాఖానకు పరుగులు పెట్టారు. ఆస్పత్రిలో హడావిడి చేశారు. విద్యార్థులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని డైరెక్టర్ డాక్టర్ బీరప్పను కోరారు.**





విద్యార్థిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే హరీశ్ రావు, మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్